
తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT



త్వరలోనే అన్నదాతలకు సుఖీభవ పథకం: సిఎం చంద్రబాబు

సంపుటి 1 సంచిక :150 ఎడిటర్: బక్క రవీందర్ ప్రచురణ: హైదారాబాద్ శుక్రవారం 3-01-2025 వెల: 5/రూ.

## పంటలు వేసిన రైతులకే పథకం.. 14 నుంచి జమ!




హైదారాబాద్ , జనవరి 2 (డైలీ రిపోర్ట్): రైతుభరోసా పథకం కింద లబ్ధి పొందాలంటే రైతులు ఇక తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాల్సిందే! ఎన్ని ఎకరాల్లో పంటలు వేస్తే అన్ని ఎకరాలను ఆ దరఖాస్తులో పొందుపర్చాలి! ఉదాహరణకు పదెకరాలున్న రైతు, ఏడెకరాల్లో పంటలు వేస్తే ఆ వివరాలే పొందుపర్చాలి! పంటలు వేసినట్లుగా ధ్రువీకరించుకున్న తర్వాతే రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. ఇన్ని ఎకరాలకు మాత్రమే పెట్టుబడి సాయం అంటూ రైతుభరోసాపై ఎలాంటి పరిమితి విధించే అవకాశాలు కనిపించడం లేదు. అయితే దున్నేవారికి మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించింది. అవకతవకలకు అవకాశం లేకుండా ఉండేందుకు సాగు చేసిన పంటలను శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తించాలనీ ప్రతిపాదించింది. ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రైవేటు ఉద్యోగులైనా, ఆదాయపు పన్ను చెల్లింపుదారులైనా పంటలు సాగుచేస్తే పెట్టుబడి సాయాన్ని అందించాలని ప్రతిపాదించారు. గురువారం సచివాలయంలో మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి సమావేశమై ఈమేరకు కీలక ప్రతిపాదనలు చేశారు. శనివారం (4వ తేదీ) నిర్వహించనున్న క్యాబినెట్ భేటీలో ఈ ప్రతిపాదనలపై చర్చించి.. రైతుభరోసా పథకం విధివిధానాలను అధికారికంగా ప్రకటించనున్నారు

## టెట్ పరీక్షలు ప్రారంభం



తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) పరీక్షలు గురువారం నగరంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 20వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. తొలిరోజు నగరంలో ఏర్పాటు చేసిన ఒక సెంటర్‌లో ఉదయం పూట జరిగిన పరీక్షకు మొత్తం 160 మంది అభ్యర్థులకు గాను 85 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 170 మందికి 106 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి రోజువారీగా కేంద్రాల సంఖ్య పెరుగుతుందని చెప్పారు.

## అంబేడ్కర్ యూనివర్సిటీ క్యాలెండర్ ఆవిష్కరణ





బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెబుతున్న ఆ పార్టీ నాయకులు రావుల జంగయ్య, యువ నాయకుడు పంకజ్ షిండే

జనవరి 2 (డైలీ రిపోర్ట్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ యూనివర్సిటీ క్యాలెండర్, డైరీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. కాగా, తొలుత అంబేద్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ముఖ్యమంత్రికి బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎంతో చర్చించారు.

## సీఎంఆర్ ఐటీ బాలికల హాస్టల్ వద్ద విద్యార్థులు ఆందోళన

**కాలేజీ గర్ల్స్ హాస్టల్ బాత్రూమ్‌లో కెమెరాలు**

**300 వీడియోలు రికార్డ్ చేసినట్లు అనుమానం**



మేడ్చల్ టౌన్, జనవరి 2 (డైలీ రిపోర్ట్): వాష్‌రూంలో ఉండగా.. వీడియోలు తీశారంటూ కండ్లకోయ సీఎంఆర్ ఐటీ బాలికల హాస్టల్ వద్ద విద్యార్థులు ఆందోళనకు దిగారు. బుధవారం రాత్రి నుంచి హాస్టల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు రంగంలోకి దిగారు. గురువారం కూడా విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగించగా.. విద్యార్థి సంఘాలు అండగా నిలిచాయి. మహిళా కమిషన్ కూడా ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. మేడ్చల్ ఏసీపీ నేతృత్వంలో పోలీసు దర్యాప్తు ప్రారంభమైంది. విద్యార్థులు, పోలీసుల కథనం ప్రకారం.. బాలికల హాస్టల్ విద్యార్థిని ఒకరు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లగా.. వెంటిలేటర్ నుంచి ఎవరో సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్నట్లు గుర్తించి, తోటి స్నేహితులకు చెప్పింది. విద్యార్థులంతా వార్డెన్‌కు విషయం చెప్పగా.. స్పందన లేకపోవడంతో రాత్రికి రాత్రి హాస్టల్ ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న మిగతా హాస్టళ్ల విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఈ ఘటనపై విచారణ జరపాలంటే హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. హాస్టల్ సిబ్బంది సెల్‌ఫోన్లను విశ్లేషించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటికి శాంతించిన విద్యార్థినులు.. గురువారం ఉదయం తమ ఆందోళను కొనసాగించారు. పలు విద్యార్థి సంఘాల నేతలు గేటు దూకి, లోనికి చేరుకుని.. విద్యార్థినులకు సంఘీభావం తెలిపారు. చూస్తుండగానే ఆందోళనకారుల సంఖ్య పెరగడంతో మరోమారు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మేడ్చల్ ఏసీపీ నేతృత్వంలోని పోలీసులు అక్కడకు చేరుకోగా.. హాస్టల్ వార్డెన్ తీరును నిరసిస్తూ.. విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. గతంలోనూ వాష్‌రూమ్‌ల వద్ద వీడియోలు తీస్తున్న ఘటనలపై ఫిర్యాదు చేసినా.. వార్డెన్ పట్టించుకోలేదని వివరించారు.

## పేదలకు రేవంత్ సర్కార్ తీపి కబురు.. ఒక్కొక్కరికి ఆరు కిలోలు, త్వరలోనే పంపిణీ



రాష్ట్రంలోని పేద, దిగువ మధ్య తరగతి వర్గాల కోసం చారిత్రక నిర్ణయం తీసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా సన్నం బియ్యం అందించాలని యోచిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు.